క్లుప్తంగా

పెన్నానదిలో వినాయక నిమజ్జనం చేయవద్దు

ప్రొద్దుటూరు క్రైం : మైలవరం జలాశయం నుంచి ఎక్కువగా నీరు వదలిన కారణంగా పెన్నానదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నట్లు రూరల్ సీఐ బాలమద్దిలేటి మంగళవారం రాత్రి తెలిపారు. ప్రజలెవ్వరూ పెన్నానదిలో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేయరాదని సీఐ సూచించారు. కామనూరు సమీపంలోని కుందూ బ్రిడ్జి వద్ద మాత్రమే నిమజ్జనం చేయాలన్నారు. ప్రజలు, వినాయక భక్తులు పెన్నానదిలోకి వెళ్లరాదని, నదిని దాటే ప్రయత్నం చేయవద్దని తెలిపారు. పశువులు కూడా పెన్నా నది వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ ప్రజలకు సూచించారు.

గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు



స్కానింగ్ పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ మృదుల

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం గైనకాలజిస్ట్ డాక్టర్ మృదుల ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ప్రతినెల ప్రధానమంత్రి మాతృత్వ శిశు సంక్షేమ పథకం కింద ఉచితంగా స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తామని హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేంద్ర తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మి, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు




విజేతలతో మాస్టర్ నాయబ్‌రసూల్

పోరుమామిళ్ల : ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఈనెల 9, 10 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్లకు రెండు కాంస్య పతకాలు దక్కాయని మంగళవారం మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు. సబ్ జూనియర్స్ 21 కేజీల విభాగంలో నదీశ్, జూనియర్స్ విభాగంలో సాయికృష్ణ తేజ కాంస్య పతకాలు సాధించారన్నారు. జిల్లా తైక్వాండో అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, కోచ్ సుభాష్ ఉస్మాన్ పతక విజేతలను అభినందించారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పోరుమామిళ్ల : మొక్కజొన్న సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా కత్తెరపురుగును సమర్థవంతంగా నివారించవచ్చని శాస్త్రవేత్త మధురో తెలిపారు. మంగళవారం పోరుమామిళ్ల, కాశినాయన, బి.మఠం, కలసపాడు మండలాల్లో జిల్లా వనరుల కేంద్రం నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు శివసై, మధురో, మురళీధర్‌రెడ్డి పర్యటించారు. వారి వెంట 5 మండలాల వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించినప్పుడే మంచి ఫలితాలు సాధించగలరని వారు పేర్కొన్నారు. వరిలో కొత్త వంగడాలు వచ్చాయని, వాటి గురించి రైతులు అవగాహన పెంచుకొని సాగు చేయాలని సూచించారు.

ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్సీ దంపతులు



ఎమ్మెల్సీ దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ రెడ్డినగర్‌లోని శ్రీ కోదండ రామస్వామి దేవస్థాన ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం నిర్వహించిన సీతారాముల కల్యాణంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఆయన సతీమణి తులసమ్మ, కుమారుడు ఆదిత్యారెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి స్వాగతం పలికి, స్వామి మెమెంటోలు అందచేసి, శాలువాలతో సత్కరించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచే పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో మహిళా బృందాల కోలాటం అందరినీ ఆకర్షించింది.

జాబ్ మేళాను వినియోగించుకోవాలి

ప్రొద్దుటూరు : జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ప్రతి నెలా జాబ్ మేళా నిర్వహిస్తారని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ బాబు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో రిలయన్స్ రీటైల్ లిమిటెడ్, అమెజాన్, ఏఐఎల్ డిక్సన్ కంపెనీలు పాల్గొన్నాయి. 88 మంది నిరుద్యోగులు జాబ్ మేళాకు హాజరవ్వగా వారిలో 36 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని తెలిపారు.

నిమజ్జనానికి తరలిన బొజ్జ గణపయ్య



ప్రొద్దుటూరు కల్చరల్ : నిమజ్జనానికి తరలిన అమ్మవారిశాలలోని గణనాథుడు



కాశినాయన : నిమజ్జనానికి వెళుతున్న గణనాథుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన బొజ్జ గణపయ్యలను నిమజ్జనానికి తరలించారు. మంగళవారం ఉదయం స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కొందరు ఉత్సవ కమిటీల వారు లడ్డూ వేలం వేయడంతోపాటు అన్నదానం, ఉట్టి కొట్టు కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గణనాథులను ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లోకి ఎక్కించి పురవీధుల్లో డప్పు వాయిద్యాల సందడి, బాణసంచా పేలుళ్ల మధ్య రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆర్టీపీపీ రోడ్డులోని పెన్నానదిలో, కామనూరు, చాపాడు వద్ద కుందూ నదిలో పార్వతీపుత్రుడిని నిమజ్జనం చేశారు. నిమజ్జనం నిర్వహించే చోట ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం

కాశినాయన : మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామంలో మంగళవారం గణేశుని నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. డప్పులు, మంగళవాయిద్యాలతో కోలాటం ఆడుతూ వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు. అంతకుముందు అన్నదానం నిర్వహించారు. నిమజ్జనంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం

చాపాడు : మండలంలో కొలువుదీరిన గణనాథుని నిమజ్జన వేడుకలు మంగళవారం మూడో రోజు ఘనంగా జరిగాయి. ఈ క్రమంలో మండలంలోని రాజువారిపేటలో జరిగిన నిమజ్జన వేడుకలో వినాయకుడి లడ్డూ వేలంలో లక్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి రూ.26,500లకు దక్కించుకోవగా, టీఓపల్లె గ్రామంలో వేలంలో చంద్ర ఓబుళరెడ్డి అనే వ్యక్తి రూ.27వేలకు దక్కించుకున్నారు.

ఉట్టి కొట్టి చూడు..



రాజుపాళెంలో ఉట్టి కొడుతున్న యువకుడు

రాజుపాళెం : వినాయక పండుగను పురస్కరించుకొని మండల కేంద్రమైన రాజుపాళెం గ్రామంలోని రామాంజనేయ స్వామి ఆలయం వద్ద యువకులంతా ఎంతో ఉత్సాహంగా ఉట్టి కొట్టారు. కార్యక్రమానికి యువకులకు పోటీగా యువతులు కూడా వచ్చారు. ఈ వేడుకను చూసేందుకు పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. ఎంతో ఉత్సాహంగా సాగింది.

నిర్లక్ష్యం చేశారు.. నిండా ముంచారు

- వరదపై సమాచారం ఉన్నా చర్యలు శూన్యం
- ప్రభుత్వ ముందుచూపు లేకపోవడంతోనే 47 మంది బలి
- అండగా ఉండాల్సిన సమయంలో చంద్రబాబు నీచ రాజకీయాలు
- కూటమి ప్రభుత్వ తీరును తూర్పారబట్టిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



అట్లూరు : బుడమేరు వరదను అంచనా వేయడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని, ఈ కారణంగా విజయవాడ శివారు ప్రాంతాలను నీట ముంచిందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వర్షాలపై వాతావరణశాఖ ముందస్తు హెచ్చరికలు చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అలానే బుడమేరు వరద నీటి దిగువకు వదులుతున్నట్టు ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు సమాచారమిచ్చినప్పటికి నిర్లక్ష్యం చేసి 47 మంది ప్రాణాలను (ప్రభుత్వ లెక్కల ప్రకారం) బలిగొందన్నారు. వాతావరణ శాఖ, ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన సమాచారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా తరలించి ఉంటే ప్రాణ నష్టం తప్పేదన్నారు. నేను విజనరీ అని గొప్పలు చెప్పుకునే సీఎం చంద్రబాబు వరదను అంచనా వేయడంలో ఆయన విజనరీ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. విపత్కర పరిస్థితులలో ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం నీచ రాజకీయాలకు దిగుతోందన్నారు. ప్రకాశం బ్యారేజీకి అడ్డుపడిన బోటు విషయంలో అప్పటి వైఎస్ జగన్ ప్రభుత్వంపై నానా యాగీ చేసిన చంద్రబాబు, ఇప్పుడూ ఆయన ప్రభుత్వంలో ప్రకాశం బ్యారేజీకి బోట్లు ఢీకొన్న సంఘటనలను కుట్రలంటూ చెప్పడం ఆయన కుటిల రాజకీయాలకు నిదర్శనమన్నారు. కేవలం కరకట్టలో ఉన్న తన నివాసాన్ని, ఏబీఎన్ వేమూరి రాధాకృష్ణా యాక్టివ్ పవర్ ప్లాంట్‌లోకి నీరు చేరకుండా రక్షించుకోవడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయత్నం చేశారన్నారు. ఈ కారణంగా కృష్ణాలోకి విడుదల చేయాల్సిన బుడమేరు నీటిని వెలగలేరు వద్ద గేట్‌లు ఎత్తడంతోనే ఇంతటి ఘోరమైన పరిస్థితి విజయవాడ ప్రజలు చవిచూశారన్నారు. ప్రస్తుతం వరద ప్రభావిత ప్రాంతాల్లో నీరు కొంతమేర తగ్గినప్పటికీ సహాయక చర్యలు ప్రజలకు అందకపోవడం కూటమి ప్రభుత్వ డొల్లతనాన్ని బయటపెట్టిందన్నారు. ఆ ప్రాంతంలో ఈ రోజుటికి తాగునీరు అందడం లేదంటే ప్రభుత్వం ఎంత అసమర్థంగా వ్యవహరిస్తోందో అర్థం చేసుకోవచ్చాన్నరు. వ్యవస్థలు వినియోగించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విఫలమయ్యారని తెలియజేశారు. కాగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నిర్మించిన రిటైనింగ్ వాల్ విజయవాడ ప్రాంతాన్ని కృష్ణా నది వరద నుంచి రక్షించిందన్నారు. రిటైనింగ్ వాల్ లేకపోయింటే సగం విజయవాడ నగరం నీటిలో మునిగేదని చెప్పుకొచ్చారు. ప్రజలకు ఎదురైన నష్టాన్ని ప్రభుత్వమే భరించాలంటూ డిమాండ్ చేశారు. అలానే వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లతెరిచి రాబోయే రోజుల్లో ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదురు కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

జీఓ 85కు వ్యతిరేకంగా డాక్టర్ల నిరసన

దువ్వూరు : దువ్వూరు ప్రాథమిక కేంద్రంలో ఏపీ ప్రాథమి కేంద్రాల వైద్యుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్లు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్లు సురేష్ బాబు, హేమలత, వికసిత, రోషిణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 85కు వ్యతిరేకంగా సమ్మె చేస్తున్నామని తెలిపారు. ఈ జీఓ వలన గ్రామీణ ప్రాంతాల్లో తాము చేసే మూడేళ్ల సర్వీసు అర్థం లేకుండా పోతుందని, అకస్మాత్తుగా జీఓ మార్చడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ జీఓను రద్దు చేయాలని రెండు నెలలుగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు యూనియన్ల ద్వారా వినతి పత్రాలు ఇచ్చినా వారి నుంచి సరైన స్పందన లేకపోవడంతో సమ్మె చేస్తున్నామన్నారు. కోవిడ్ సమయంలో జీవాలను పణంగా పెట్టి సేవలు అందించినప్పటికీ ఈ జీఓ వల్ల తాము పీజీ చదువుకునే అవకాశాలు తగ్గుతాయన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులపై చాలా నష్టం జరుగుతుందన్నారు. 11, 12 తేదీల్లో వైద్య సేవల్లో అంతరాయం లేకుండా నిరసన కొనసాగిస్తామని, 13న పీహెచ్‌సీ వైద్యుల అత్యవసర సేవలను మినహాయించి, అన్ని రిపోర్టింగ్, అధికారిక కమ్యూనికేషన్ కార్యక్రమాలను నిలిపివేస్తామని తెలిపారు. 14న అత్యవసర సేవలకు మాత్రమే పీహెచ్‌సీ వైద్యులు సేవలు అందిస్తారన్నారు. 15న ఛలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం స్పందించకుంటే 16వ తేదీ నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు.

జీఓ – 85ను వెనక్కు తీసుకోండి

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ వైద్యుల పీజీ ప్రవేశం కోసం ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ విడుదల చేసిన జీఓ నెంబర్ 85ను వెనక్కు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ రాజేష్, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ ఓబులేసు, డాక్టర్ సంపత్, డాక్టర్ సాయితేజలు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కోవిడ్–19 సమయంలో ప్రాణాలను పణ్ణంగా పెట్టి వైద్యసేవలందించిన తమకు ప్రస్తుతం విడుదల చేసిన జీఓ ద్వారా మూడు సంవత్సరాలు సర్వీసు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి జీఓను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దశలవారీ నిరసనలు చేపడతామని తెలిపారు.

ఆత్మహత్య మహాపాపం



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీసీహెచ్‌ఎస్ హిమ దేవి

ప్రొద్దుటూరు క్రైం : ఆత్మహత్య మహాపాపమని, మానవ జన్మ ఎంతో ఉత్తమమైనదని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ హిమదేవి తెలిపారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఆస్పత్రి నుంచి గాంధీ రోడ్డు వరకు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీసీహెచ్‌ఎస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒత్తిడి వల్ల ఎక్కువ మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఒక్క క్షణం ఆలోచిస్తే ఎవరూ ఆత్మహత్యల వైపు చూడరన్నారు. ఆత్మహత్య చేసుకోవడం వల్ల సమస్యకు పరిష్కారం దొరకదని, జీవించి ఉంటే ఏమైనా సాధించవచ్చని పేర్కొన్నారు. పిల్లలను అతిగా పెంచడం వల్ల వారు చిన్న చిన్న సమస్యలను తట్టుకునే శక్తిని కోల్పోతారన్నారు. విద్యార్థులు ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. విద్యార్థులకు స్వేచ్ఛగా చదువుకునే వెసులుబాటు లేకుండా పోయిందని తెలిపారు. ర్యాంకుల కోసం చదివించడం వల్ల వారిపై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, మానసిక వైద్యురాలు డాక్టర్ కవితా ప్రసన్న, నర్సింగ్ సూపరింటెండెంట్ రాణెమ్మ, సాధన నర్సింగ్ కాలేజీ, శ్రీనివాస ఫార్మసీ కాలేజీ, వెంకటేశ్వర ఫార్మా కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి



శివాలయం సర్కిల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న డీఎస్పీ భక్తవత్సలం, అధికారులు, విద్యార్థులు

ప్రొద్దుటూరు : మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ఫలితాలను అందరికీ వివరించి, నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు. జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక విజయకుమార్ సర్కిల్ నుంచి శివాలయం సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవ హారంగా ఏర్పడ్డారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కొందరు విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి చదువును నిర్లక్ష్యం చేస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోలేక పోతున్నారన్నారు. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ యువత డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి అనారోగ్య బారిన పడి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సైకాలజిస్ట్ డాక్టర్ వెంకటరాముడు, డాక్టర్ నాగార్జున మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనకు యువత ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్ధేశ్వరరావు, భువనేశ్వరరెడ్డి, రామాంజనేయరెడ్డి, స్టార్ ఫౌండేషన్ అధ్యక్షుడు సిరాజ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు జూటూరు విజయకుమార్, అశోక్, సుబ్బయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు, హెచ్‌ఓడీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి వినయ్‌కుమార్

బద్వేలు అర్బన్ : సమస్యలకు పరిష్కారం ఆత్మహత్య కాదని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక గౌతమ్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలే తప్ప వాటికి భయపడి ఆత్మహత్యలు చేసుకోవడం సరికాదన్నారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగుల్చుతాయనే విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలన్నారు. ఆత్మహత్య ఆలోచనలను సకాలంలో గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇస్తే ప్రాణాలను కాపాడవచ్చని, ఆ దిశగా అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సురేంద్రనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు, కళాశాల అధ్యాపకులు సుధాకర్, రాజగోపాల్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు అనుసరించాలి



వరిపైరుకు మందు పిచికారీ చేయిస్తున్న వ్యవసాయ అధికారులు

అట్లూరు : రైతులు యాజమాన్య పద్ధతులు పాటించినప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని కమలకూరు సచివాలయ పరిధిలో కాటంవారిపల్లి గ్రామ పొలాల్లోని రైతులతో పొలంబడి కార్యక్రమం ఏఓ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మిత్రపురుగులు, శత్రు పురుగులను గుర్తించాలన్నారు. ప్రస్తుతం వరి పైరులో ఆకుముడత కాండం తొలుచు తెగులు ఆశించిందన్నారు. వాటి నివారణకు వాడాల్సిన మందులను తెలియజేశారు. అనంతరం కొండూరు పొలాలలోని వరిపైరులో కాండం తొలుచు పురుగు నివారణ కోసం క్లోరోపైరిఫాస్‌ను పిచికారీ చేయించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు రామ్మోహన్‌రెడ్డి, సందీప్, అనూషా, ఏపీఎం సురేష్, రైతులు పాల్గొన్నారు.

బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీడీఓ సావిత్రమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు

దువ్వూరు : బాలింతలు, గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని చాపాడు ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సి.బయనపల్లె, దువ్వూరులోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు వారు తినే ఆహారంపైనే వారి ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని తెలిపారు. కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, ఫైబర్ వంటి పోషకాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి ఏడాది సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. మాంసంకృతులు, విటమిన్లు అధికంగా తీసుకంటే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సౌజన్య, వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు రాధా, విజయ, సునీత పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ

చాపాడు : గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం వలన మెరుగైన ఆరోగ్యంతో ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ అన్నారు. మండలంలోని అన్నవరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలలో పోషకాహారం అందుతుందని, వీటిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పీరయ్య, అంగన్వాడీ టీచర్లు జ్యోతి, నాగమునేమ్మ, పార్వతమ్మ, రమాదేవి, కృష్ణవేణి,యల్లమ్మ, విజయ, మహిళా సంరక్షణ కార్యకర్త ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు మన రెవెన్యూ అధికారులు



ప్రొద్దుటూరు మండల రెవెన్యూ కార్యాలయంలో ఖాళీగా ఉన్న తహసీల్దార్ ఛాంబర్

ప్రొద్దుటూరు : జిల్లాలోని మండల రెవెన్యూ కార్యాలయాలన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. తక్షణ అవసరాల కోసం ఎవరైనా ప్రజలు వెళితే స్పందించే వారే లేరు. మరికొన్ని రోజుల పాటు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. విజయవాడ పరిధిలో వరదల ప్రభావం వల్ల నష్టం జరిగిన విషయం అందరికీ తెలిసిందే. ప్రభుత్వం రాయలసీమ ప్రాంతంలోని పలు జిల్లాల నుంచి అధికారులను వరద అంచనాలను తయారు చేసేందుకు పంపారు. శనివారం వీరందరూ విజయవాడకు వెళ్లారు. అంతకు నాలుగు రోజుల మునుపే పలువురు మున్సిపల్ కమిషనర్లు, పారిశుద్ధ్య సిబ్బందిని కూడా పంపడం జరిగింది. వైఎస్సార్ జిల్లాలో పెద్ద మండలంగా ఉన్న ప్రొద్దుటూరుకు సంబంధించి తహసీల్దార్ గంగయ్యతోపాటు ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐని పంపారు. నియోజకవర్గం పరిధిలోని రాజుపాళెం మండలంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మరికొన్ని రోజుల పాటు వీరు విజయవాడలో ఉండనున్నారు.

మాతాశిశు మరణాలు నియంత్రించాలి



బి.కోడూరు: గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

బద్వేలు అర్బన్ : మాతాశిశు మరణాలు సంభవించకుండా క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని గాంధీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ పి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. మంగళవారం హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు ప్రసవం అయ్యేంత వరకు పర్యవేక్షిస్తుండాలని కోరారు. అలాగే పౌష్టికాహారం వలన కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించాలని కోరారు.

కార్యక్రమంలో గైనకాలజిస్టు డాక్టర్ పవిత్ర, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రతి కాన్పు ప్రభుత్వాసుపత్రిలోనే జరగాలి

బి.కోడూరు : ప్రతి కాన్పు ప్రభుత్వాసుపత్రిలోనే జరగాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌లు తెలిపారు. మంగళవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ మాతాశిశు మరణాలు అరికట్టాలంటే, తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెల 9, 10వ తేదీల్లో వైద్యులతో పరీక్ష చేయించుకోవాలన్నారు. మందులు వాడాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, పీహెచ్‌ఎన్ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజర్లు జాన్ విలియం, విజయలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

మైదుకూరు : మేలైన యాజమాన్య పద్ధతులతో మిరప పంటలో అధిక దిగుబడిని సాధించవచ్చని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు.

కేంద్రంలో మంగళవారం ఉద్యాన పంటలపై రైతులకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ మిరప సాగులో సమగ్ర పోషక యాజమాన్యంతో నాణ్యమైన పంటతోపాటు, అధిక దిగుబడిని పొందవచ్చని పేర్కొన్నారు. సేంద్రీయ ఎరువుల ఆవశ్యకత, పచ్చిరొట్ట ఎరువులు, జీవ రసాయన ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు శ్రీవిద్యారాణి పసుపులో సమగ్ర సస్యరక్షణ చర్యలపై, ఫిరోజ్ హుస్సేన్ మేలైన యాజమాన్య పద్ధతులు, మిరప రకాలు, చీడపీడలపై బీఎస్ కాంతిశ్రీ మిరపలో విలువ ఆధారిత పదార్థాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా కేవీకే మిరప సాగుపై ప్రచురించిన బుక్‌లెట్లను రైతులకు అందించారు. బద్వేలు డ్వామా టెక్నికల్ ఆఫీసర్ చైతన్య, వనిపెంట ఎఫ్‌పీఓ చైర్మన్ బాల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బతికి సాధించాలన్న బలమైన కాంక్ష అవసరం

వైవీయూ : సమస్యకు భయపడి నిండు జీవితాన్ని మధ్యలోనే తుంచేయక బతికి సాధించాలన్న బలమైన కాంక్ష ఉండాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వి.బ్రహ్మయ్య అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ సందర్భంగా మంగళవారం ప్రభుత్వ పురుషుల కళాశాల, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, లయన్స్ క్లబ్‌ల ఉమ్మడి ఆధ్వర్యంలో కొండూరు జనార్దన్‌రాజు పర్యవేక్షణలో జరిగిన సమావేశానికి ఆయన ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. ఈ జీవితం అత్యంత విలువైనదని, జన్మను సార్థకం చేసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పానీయాల సేవనం, విలాసాలు, ఇతరులతో జీవితాన్ని పోల్చుకోవడం మంచిది కాదన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, రిటైర్డ్ ఇంజనీరు దేశు వెంకటరెడ్డి మాట్లాడారు. మానవత కృష్ణారెడ్డి, డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడారు.